


కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి పట్టణంలో రైతు నిరసన దీక్షలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సబితాఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, బాల్క సుమన్, బీఆర్ఎస్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

• రైతుకు దన్నుగా..

# కౌరవ పాలనపై కురుక్షేత్రమిది

మొదటిపేజీ తరువాయి...

రైతులు చేతులెత్తారు. 'మీ కొడంగల్‌కు కూడా స్పెషల్‌గా ఏం ఇస్తలేడా? ఎవరికేం ఇయ్యకున్నా కొడంగల్ మాత్రం ఇస్తున్నడేమో అనుకున్న.. అది కూడా లేదా? మరి ఎవరికేం ఇచ్చిండు? 14 నెలల్లో ఒక్కటి మాత్రం బాగిచ్చిండు.. అల్లుడికి మాత్రం కట్నం కింద లగచర్ల భూములిచ్చిండు.. వాటికి సూటి పెట్టిండు' అంటూ దెప్పిపొడిచారు. 'అదానీ కంపెనీ.. అల్లుడి కంపెనీ కోసం భూములు గుంజుకునేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మీ మీదికి వచ్చి కుతంత్రాలు చేస్తున్నది' అంటూ మండిపడ్డారు. భూములు ఇచ్చేది లేదని తిరగబడ్డవారిపై కలెక్టర్ మీద హత్యాప్రయత్నం చేశారని ఆరోపిస్తూ సుమారు 70 మందిపై కేసులు పెట్టారని, కాంగ్రెస్ వాళ్లను, బీజేపీ వాళ్లను కట్ చేసి ఒక్క బీఆర్ఎస్ వాళ్లు 40 మందిపై కేసులు పెట్టి జైలుకు పంపారని, పట్నం నరేందర్‌రెడ్డితో సహా తమ కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు.



రైతు నిరసన దీక్షకు భారీ ర్యాలీతో వస్తున్న కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు

## దుర్యోధనుడు అని ఉత్తగ అనలే

'రేవంత్‌రెడ్డిని నేను దుర్యోధనుడు అని ఉత్తగ అనలే.. పాండవులను ఊళ్లల్లో ఉండనీయకుండా అడవికి పంపిండు.. అట్లనే రేవంత్ కూడా మా ఆడబిడ్డలను తండాల్లో ఉండనీయకుండా అర్ధరాత్రి తండాల మీద పడి.. వాళ్ల తలుపులు ఇరగ్గొట్టి.. ఆడోళ్లను అవమానించి పుట్టకొకలు.. చెట్టుకొకలు అన్నట్టు జంగల్‌పొంట ఉరికిచ్చిండు. అందుకే రేవంత్‌రెడ్డి దుర్యోధనుడు అంటున్న' అని కేటీఆర్ దుయ్యబట్టారు.

'భూములు కోల్పోతున్న గిరిజనులకు అండగా నిలబడ్డం.. వాళ్లను ఢిల్లీ దాకా తీసుకెళ్లి జరిగిన ఘోరాన్ని జాతీయ కమిషన్ ముందు చెప్పినం.. 40 రోజుల తర్వాత న్యాయం గెలిచి రైతులకు బెయిల్ వచ్చింది.. వాళ్లందర్నీ బయటకు తీసుకొచ్చినం' అని గుర్తుచేశారు. హకీంపేటలో టెంట్ వేసుకున్న గిరిజన మహిళల దగ్గరికి వెళ్లగా 'అన్నా.. మా భుములు పోకుండ జర సూడండ్రి' అని కేటీఆర్‌ను వేడుకున్నారు.

> 14 నెలల నుంచి రేవంత్‌రెడ్డి ఎవరి కోసం పనిచేస్తున్నడో ప్రజలు ఒక్కసారి ఆలోచించాలె. రైతులు, మహిళలు, పేదల కోసం సీఎం ఒక్క పని చేసింది లేదు. యువత కోసం చేసిందేం లేదు. ఎవల కోసం పనిచేస్తున్నడంటే ఎనుముల అన్నదమ్ముల కోసం.. ఆయన అల్లుడి కోసం.. అదానీ కోసం.. బావమర్దుల కోసం.. ఆయన కుటుంబ సభ్యులకు వందల, వేల కోట్లు దోచిపెట్టేందుకు.. ఇక్కడి భూములు గుంజుకొనేందుకు మాత్రం బ్రహ్మాండంగా పనిచేస్తున్నడు.
>
> - కేటీఆర్



రైతులు బహూకరించిన నాగలితో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



> మా కొడంగల్ భూములల్ల తొండలు కూడా గుడ్లు పెట్టవని రేవంత్‌రెడ్డి అన్నడు కదా.. నిజమే అయుండొచ్చని కోస్గికి వస్తుంటే నేను మా సబితక్క, నరేందర్‌రెడ్డి, అందరం దిగి చూసినం. లగచర్ల పరిధి ప్రారంభమని బోర్డు ఉన్నది.. ఎక్కడ చూసినా పచ్చని వరి పంటలు.. బ్రహ్మాండంగా ఇక్కడ్నుంచి అక్కడి దాక విస్తరించి ఉన్నయి.. ముఖ్యమంత్రి అన్నోడు అబద్ధం చెప్తడా? కొడంగల్ భూములల్ల తొండలు గుడ్లుపెడ్తున్నయా? పంటలు పండుతున్నయా? - కేటీఆర్

### ఒక్క ఓటు తక్కువైనా రాజకీయ సన్యాసం

'ఇయ్యాల ఎట్లున్నదంటే ముఖ్యమంత్రి నియోజకవర్గంలో కూడా ఎప్పుడు ఎన్నిక వస్తదా? ఎప్పుడు కాంగ్రెసు బొందపెడుదామా? అని చూస్తున్నరు. రేవంత్‌రెడ్డికి బంపర్ ఆఫర్ ఇస్తున్న.. నువు అంటున్నవ్ గదా.. కుల గణన చేసిన బీసీలంతా సంతోషంగా ఉన్నరు.. రైతుబంధు ఏసిన రైతులంతా సంతోషంగా ఉన్నరు.. రైతు కూలీలకు పైసల్ ఏసినా వాళ్లంతా సంతోషంగా ఉన్నరు.. ఇండ్లకు కాయితాలు ఇచ్చిన.. పేదోళ్లు సంతోషంగా ఉన్నరు అంటున్నవ్ గదా? దమ్ముంటే కొడంగల్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఇక్కడికి రా.. ఎవరు గెలుస్తరో చూద్దాం' అని కేటీఆర్ సవాల్ విసిరారు. 'పట్నం నరేందర్‌రెడ్డి నామినేషన్ వేసి ఇంట్ల కుసుంటడు.. మేము, జిల్లా నాయకులం కొంతమందిమి తిరుగుతం.. 50 వేల మెజార్టీకి ఒక్క ఓటు తక్కువైనా నేను రాజకీయ సన్యాసం తీసుకుంట. ఇక రాజకీయంలోనే ఉండ' అంటూ సవాల్ విసిరారు. ఒక్క కొడంగలే కాదని, రాష్ట్రం మొత్తంలో వాస్తవ ముఖచిత్రమిదని చెప్పారు. 'నువ్వేదో అడ్డిమార్ గుడ్డిదెబ్బలో ముఖ్యమంత్రి అయిపోయి.. ఇగ ఇంత కంటే పెద్దోడు ఎవడూ ప్రపంచంలో లేడన్నట్టు ఏడబడితే ఆడ భూమి గుంజుకుంట.. ఏది పడితే అది అబద్ధం చెప్తా.. ఇదివరకే చెప్పినట్టు 420 హామీలిచ్చి మళ్ల మోసం చేస్తనంటే కుదరదు' అని హెచ్చరించారు. ఏ ఒక్క ఊరిలో వందశాతం రుణమాఫీ అయినా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజకీయ సన్యాసం తీసుకొని మళ్లీ కనబడకుండా వెళ్లిపోతానని చెప్పారు. 'కోస్గికి వస్తుంటే ఎక్కడ చూసినా జనమే జనం.. మేం వెళ్తున్నది నిరసన దీక్షకా? లేక ఉప ఎన్నిక జరిగి రేవంత్‌రెడ్డి ఓడిపోయి నరేందర్‌రెడ్డి గెలిచిపోయి జులూస్ తీస్తున్నమా? అర్థం కాలేదు.. ఆడికెల్లి ఈడికి రానీకే గంట పట్టింది. నా చేతులు అటు గుంజి ఇటు గుంజి గోరు విరిగిపోయి రక్తం వస్తున్నది' అని చూపించారు.

> రేవంత్‌రెడ్డీ.. నీకు దమ్ముంటే కొడంగల్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిఇక్కడికి రా.. ఎవరు గెలుస్తరో చూద్దాం.. నీకు మాటిస్తున్నం. మేము ఇంత మందిమి ప్రచారానికి కూడా రాము. మా పట్నం నరేందర్‌రెడ్డి నామినేషన్ వేసి ఇంట్ల కూసుంటడు.. బయటికిగుడ రాడు. మేమో జిల్లా నాయకులమో కొంతమందిమి తిరుగుతం. గెలుసుడు కాదు నేనే చెప్పేది.. 50 వేల మెజార్టీకి ఒక్క ఓటు తక్కువ వచ్చినా రాజకీయ సన్యాసం చేసి మళ్లా రాజకీయంలోనే ఉండకుంట పోతా - కేటీఆర్



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న రైతులు, పార్టీ నాయకులు

### సీఎంపై సోషల్ మీడియాలో ఏం తిట్లయా?


'సోషల్ మీడియా, వాట్సాప్‌లో వస్తున్న వీడియోలు ప్రజలు మాట్లేడేవి చూస్తుంటే ఏం తిట్లయా అవి.. మనిషన్నోడైతే బకెట్ల రెండు మగ్గుల నీళ్లు పోస్కొని దుంకి సచ్చిపోతుండె.. రేవంత్‌రెడ్డి కాబట్టి నడుస్తాంది.. రోషం లేని బతుకు కాబట్టి నడుస్తాంది' అంటూ కేటీఆర్ ఘాటుగా విమర్శించారు. 'తెలుగు భాషలో అన్ని తిట్లుంటవని కూడా తెల్వదు.. గొట్టం పెడితేచాలు అటు ఏడుతరాలు.. ఇటు ఏడుతరాలు తిడ్తుండ్రు.. దయచేసి తిట్టకండి.. ముఖ్యమంత్రి పదవి కన్నా గౌరవం ఇవ్వండి' అని సూచించారు. 'ఎన్నికల్లో మాత్రం ఈ మోసగాడికి గట్టిగా బుద్ధి చెప్పండి.. కాంగ్రెస్ పార్టీకి కూడా గట్టిగా బుద్ధి చెప్పండి' అని పిలుపునిచ్చారు.

> ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోస్గికి వచ్చిండు.. వచ్చి ఏం చెప్పిండు? టకీటకీమని రైతు భరోసా డబ్బులు పడ్తయన్నడు. మేము నిజమే అనుకుంటిమి. ఓట్లేసి గెలిపించినోళ్లకు ఎందుకు అబద్ధం చెప్తడులే అనుకున్నం. ఇప్పుడు టకీ లేదు.. గికీ లేదు.. ఇప్పటి దాకా ఏదీ దిక్కులేదు. - కేటీఆర్

స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నాయని ఇప్పుడు ఎకరం వరకు రైతుబంధు వేసిండని, ఎలక్షన్లు కాగానే రైతుబంధుకు రాంరాం అంటాడని వివరించారు. రేవంత్ రాష్ట్రంలోని ప్రతిరైతుకు రూ.17,500 బాకీ ఉన్నాడని చెప్పారు. 'రేవంత్‌రెడ్డి రైతుబంధు వేస్తడా? అని మా సబితక్క నవాబ్‌పేట ధర్నాలో అడిగితే ఒక రైతు లేచి అక్కా అక్కా పక్కా రేవంత్‌రెడ్డి రైతుబంధు వేస్తడు.. ఫిబ్రవరి 31లోపు అన్నడు.. ఇట్లుంటది ఆయన తీరు' అని ఎద్దేవాచేశారు.

### నీ సొంత భూముల్లో కంపెనీలు పెట్టు

'పేదోళ్ల భూములను అదానీ కోసం.. అల్లుడి కోసం దోచిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నవ్.. నీ సొంత భూములు ఉన్నయ్ కదా? అక్కడ ఫార్మా కంపెనీలు పెట్టు' అని కేటీఆర్ సూచించారు. ఎకరాకు దాదాపు రూ.80 లక్షలు పలికే భూములకు రూ.20 లక్షలు ఇచ్చి కొంటామంటున్నవ్. వెల్దండ దగ్గర నీ భూములకు రూ.25 లక్షలు ఇచ్చెయ్.. కావాలంటే బీఆర్ఎస్ తరఫున నీకు ఆపై రూ.5 లక్షలు ఇస్తం' అని ఆఫర్ ఇచ్చారు. 'నీ భూములు అట్లే ఉండాలె.. పేదోళ్ల భూములు కావాల్నా?' అని ప్రశ్నించారు. రైతు నిరసన దీక్ష అనంతరం కేటీఆర్‌కు గిరిజనులు నాగలిని బహూకరించారు. కోస్గి రైతు దీక్షకు హాజరయ్యేందుకు వెళ్తుండగా హకీంపేట వద్ద వేచి చూస్తున్న గిరిజన రైతులకు కేటీఆర్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్, పార్టీ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఫైనాన్స్ కమిషన్ మాజీ సభ్యుడు సలీం, రామకృష్ణ, వెంకటనర్సింహులు పాల్గొన్నారు.






బల్డింగ్ పైనుంచి కేటీఆర్‌కు అభివాదం చేస్తున్న స్థానికులు


## పాత్లావత్ భూమి నాయక్

### లగచర్ల బాధితులు జ్యోతి-ప్రవీణ్‌నాయక్ బిడ్డకు నామకరణం చేసిన కేటీఆర్

వికారాబాద్, ఫిబ్రవరి 10, (నమస్తే తెలంగాణ): తాము ఆపదలో ఉన్నప్పుడు దేవుళ్లలా వచ్చి బీఆర్ఎస్ నాయకులంతా అండగా నిలిచారని, తన కూతురుకు పేరు పెట్టాలని కేటీఆర్‌ను లగచర్ల బాధితురాలు పాత్లావత్ జ్యోతి కోరింది. లగచర్ల భూ పోరాటం సమయంలో నిండు గర్భిణిగా ఉన్న జ్యోతికి 20 రోజుల కిందట పండంటి ఆడబిడ్డ పుట్టింది. కేటీఆర్‌కు జ్యోతి తన బిడ్డను చూపించి 'అన్నా ఈ బిడ్డకు నువ్వే పేరు పెట్టు అంటూ జ్యోతి, భర్త ప్రవీణ్‌నాయక్ కోరారు. ఆడబిడ్డకు పేరు పెట్టాలని అడగగానే ఒక్కసారిగా కేటీఆర్ సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. 'భూ పోరాటంలో బిడ్డ పుట్టింది. అందుకే ఈ బిడ్డకు మూడు పేర్లు చెప్తా.. మీ ఇష్టమొచ్చిన పేరు పెట్టకోండి.. భూమి, ధాత్రి, అవని' అని సూచించగా భూమి అనే పేరును తల్లిదండ్రులు ఖరారు చేశారు. ఆ బిడ్డ పేరు పాత్లావత్ భూమినాయక్ అని కేటీఆర్ అనగానే ఒక్కసారిగా అందరూ కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తంచేశారు. నాడు నిండు గర్భిణిగా ఉన్న జ్యోతి భూ పోరాటంలో మొక్కవోని ధైర్యంతో పోరాటం చేసిందని కేటీఆర్ కొనియాడారు. రేపట్టి నుంచి భూమి నాయక్ అని పిలుస్తమనగానే గుండెనిండా సంతోషమనిపించిందని చెప్పా రు. 'ఈ భూపోరాటంలో మా పాత్ర చాలాచిన్నది.. నిజానికి పోరాడింది కొడంగల్ భూమిపుత్రులు, ఆడబిడ్డలే' అని తెలిపారు. పాత్లావత్ ప్రవీణ్ నాయక్‌ను పోలీసులు ఆనాడు అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారని, నిండు గర్భిణి జ్యోతి తన భర్త జాడ కోసం వికారాబాద్, దోమ, పరిగి పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతూ గంటల తరబడి పడిగాపులు కాసిందని గుర్తుచేశారు. 'మీ ఓట్లతోని గెలిచినోడు.. మీకు మంచి చేయాల్సినోడు ఏంచేస్తున్నడు ఇయ్యాల? ఆడబిడ్డలను గోస పెడ్తున్నడు. రేవంత్‌రెడ్డీ మర్చిపోకు. యాది పెట్టుకో.. మా బంజారా బిడ్డలు తలుచుకుంటే నిన్ను చిత్తుగా ఓడగొడ్తరు. నీ కల్వకుర్తికి నిన్ను పంపిస్తరు' అని హెచ్చరించారు.



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రసంగిస్తుండగా గిరిజన మహిళల కరతాళధ్వనులు



రైతు నిరసన దీక్షకు భారీగా తరలివచ్చిన రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు

### హారతి పట్టిన లగచర్ల

మొన్నటి వరకు తమ భూములు తమకు కావాలంటూ లడాయి చేసిన లగచర్ల.. కేటీఆర్ రాకతో ఉప్పొంగిపోయింది. లగచర్ల రైతులకు మొదటి నుంచీ అండగా నిలిచిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తున్నారని తెలిసి ఉదయం నుంచే లగచర్లలో పండుగ వాతావరణం నెలకొన్నది. గిరిజనుల ఆటపాటలు, సంప్రదాయ నృత్యాలు, హారతులతో కేటీఆర్‌కు లగచర్ల, హకీంపేట, రోటిబండ తండా, పోలేపల్లి రైతులు హకీంపేట వద్ద ఘన స్వాగతం పలికారు. సోమవారం కోస్గిలో రైతు దీక్షకు వెళ్తూ తుంకిమెట్ల వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించిన కేటీఆర్, అనంతరం హకీంపేట వద్ద లగచర్ల రైతులను కలుసుకున్నారు.